పెన్ పవర్
తెలంగాణ రౌండప్
శుక్రవారం 9 మే 2025 పేజీలు 8

# మిర్చి క్వింటాకు రూ.10,374

## అంతకంటే తక్కువ ధర పలికితే ఎంఐఎస్ కింద రైతులకు కేంద్రం సాయం: కిషన్‌రెడ్డి




హైదరాబాద్ పెన్ పవర్: మార్కెట్ జోక్యం పథకం (ఎంఐఎస్) కింద కేంద్ర వ్యవసాయశాఖ తెలంగాణలో మిర్చి ధర క్వింటాకు రూ.10, 374గా నిర్ణయించిందని, బహిరంగ మార్కెట్‌లో ఇంతకంటే తక్కువ ధరకు రైతులు విక్రయిం చాల్సి వస్తే ఆ తేడా మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం సాయంగా అందిస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఈమేరకు ఆయన గురువారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. "రాష్ట్రంలోని

-3 లో

అక్రమ నిర్మాణం తప్పించే విధంగా రెవెన్యూ మార్కింగ్..





ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను అడ్డుకున్న కబ్జాదారులు..

# ట్రైబల్ వెల్ఫేర్ స్థలంలో...

# కబ్జాదారుల రబస

ఫెన్సింగ్ వేయడానికి వెళ్ళిన అధికారులను అడ్డుకున్న కబ్జాదారులు..

- పోలీసులు భారీగా మోహరించి ఫెన్సింగ్‌కి అడ్డుపడిన కబ్జాదారులకి వార్నింగ్..
- హైవే రోడ్డుకి కమర్షియల్ స్థలాలు ఆక్రమించి అక్రమ షెడ్ల నిర్మాణం..
- గోదాంల ప్రహరీగోడ పక్కన గతంలో కూల్చి వేసిన చోటనే మళ్ళీ అక్రమ నిర్మాణం..
- దుండిగల్ తహాశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ వ్యవహారం..
- దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నెం. 120/11 ట్రైబల్ వెల్ఫేర్‌కి కేటాయింపు..
- మేడ్చల్ రోడ్డులో 02-25 ఎకరాలు 2016లో కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం..
- రెవెన్యూ నిర్లక్ష్యంతో సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో రోజుకో కబ్జా తెరపైకి..

-2 లో

# నైపుణ్య శిక్షణ.. ఉద్యోగావకాశాలు

- జేఎన్‌టీయూహెచ్‌తో టీసీఎస్ అయాన్ ఒప్పందం
- తొలిదశలో 100 మంది విద్యార్థులకు 20 వారాల శిక్షణ
- శ్రీధర్‌బాబు సమక్షంలో ఒప్పందం



హైదరాబాద్ పెన్ పవర్: ఇంజినీరింగ్ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు జేఎన్‌టీయూ–హైదరాబాద్.. టీసీఎస్ అయాన్ కంపెనీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. 'ప్లేస్‌మెంట్ సక్సెస్ ప్రోగ్రామ్' కింద తొలిదశలో మంథని జేఎన్‌టీయూలో పైలట్ ప్రాజెక్టుగా ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తారు. 100 మంది విద్యార్థులను ఎంపిక చేసుకొని.. టీసీఎస్ అయాన్ 20 వారాల శిక్షణ ఇస్తుంది. అనంతరం

-3 లో

# గిరిజనులకు వరం.. ఇందిరా సౌరగిరి జలవికాసం

- 18న మన్ననూరులో ప్రారంభించనున్న సీఎం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ పెన్ పవర్: ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరా సౌరగిరి జలవికాస పథకం గిరిజనులకు వరంగా మారనుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరులో సీఎం రేవంత్‌రెడ్డి ఈ నెల 18న ఈ పథకాన్ని ప్రారంభించనున్నారని తెలిపారు. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి గురువారం ఇందిరా సౌరగిరి జల వికాసం పథకంపై అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. "గిరిజనులకు ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం కింద కేటాయించిన భూములను పూర్తిస్థాయిలో సాగులోకి

-3 లో



- పోలీసులు భారీగా మోహరించి ఫెన్సింగ్‌కి అడ్డుపడిన కబ్జాదారులకి వార్నింగ్..
- హైవే రోడ్డుకి కమర్షియల్ స్థలాలు ఆక్రమించి అక్రమ షెడ్ల నిర్మాణం..
- గోదాంల ప్రహరీగోడ పక్కన గతంలో కూల్చి వేసిన చోటనే మళ్ళీ అక్రమ నిర్మాణం..
- దుండిగల్ తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ వ్యవహారం..
- దుండిగల్ మండలం డి.పోచంపల్లి సర్వే నెం. 120/11 ట్రైబల్ వెల్ఫేర్‌కి కేటాయింపు..
- మేడ్చల్ రోడ్డులో 02-25 ఎకరాలు 2016లో కేటాయించిన తెలంగాణ ప్రభుత్వం..
- రెవెన్యూ నిర్లక్ష్యంతో సర్వే నెం.120 ప్రభుత్వ భూమిలో రోజుకో కబ్జా తెరపైకి..


ట్రైబల్ వెల్ఫేర్ అధికారులను అడ్డుకున్న కబ్జాదారులు..

# ట్రైబల్ వెల్ఫేర్ స్థలంలో...
# కబ్జాదారుల రబస

## ట్రైబల్ వెల్ఫేర్ జిల్లా అధికారి పర్యవేక్షణలో ఫెన్సింగ్..

దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120/11 ప్రభుత్వ భూమిని ట్రైబల్ వెల్ఫేర్ సంస్థకు కేటాయించిన 02-25 ఎకరాల స్థలం కొద్దికొద్దిగా కబ్జాకు గురికావడపై పత్రికల్లో వస్తున్న వార్తా కథనాలతో ట్రైబల్ వెల్ఫేర్ మేడ్చల్ జిల్లా కమిషనర్ వినోద్ స్పందించి ఫెన్సింగ్ వేయడానికి గురువారం సంబంధిత స్థలం వద్దకు వెళ్ళగానే కబ్జాదారులు అడ్డుకున్నారు.. దీంతో స్వల్పంగా ఉద్రిక్తత నెలకొంది.. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకి చేరుకున్న పోలీసులు కబ్జాదారులను చెదరగొట్టారు.. ట్రైబల్ వెల్ఫేర్ అధికారుల వెంట స్థానిక రెవెన్యూ సిబ్బంది ఉన్నప్పటికీ, ట్రైబల్ వెల్ఫేర్ సంస్థ జిల్లా అధికారులు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం..

పలుమార్లు కూల్చివేసిన చోటనే మళ్ళీ నిర్మాణం..



ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జాదారులు కాసుకుని కూర్చుంటున్నారు.. సంబంధిత స్థలం ఎవరిది ఏమిటి అనే అవసరం కూడా లేదు.. కబ్జా చేయడం అమాయకులను ఎంచుకుని కట్టబెట్టడం.. లక్షల రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.. ఈ వ్యవహారంలో కొందరు అవినీతి అధికారుల చేతివాటం కూడా లేకపోలేదని ఆరోపణలు వస్తున్నాయి.. ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం విఫలమైందని చెప్పవచ్చు.. అందుకు ఉదాహరణ విఆర్వోలు, విఆర్ఏ లను ఇతర శాఖలకు పంపించడమే.. తహశీల్దార్ కార్యాలయానికి కూతవేటు దూరంలో కబ్జాలకు గురవుతున్న భూములను కూడా కాపాడలేని స్థితిలో రెవెన్యూ అధికారులు ఉండటం విశేషం.. గురువారం ట్రైబల్ వెల్ఫేర్ విభాగానికి కేటాయించిన స్థలానికి ఫెన్సింగ్ వేసేందుకు వెళ్ళిన అధికారులను కబ్జాదారులు అడ్డుకుని సీన్ క్రియేట్ చేశారు.. మరోవైపు సర్వేయర్ చూపించిన హద్దులు హాస్యాస్పదం, అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఆరోపిస్తున్నారు.. గతంలో రెవెన్యూ అధికారులు పలుమార్లు కూల్చివేసిన చోటనే మళ్ళి నిర్మించి పట్టాకప్పి ఉంచిన ఓ అక్రమ కట్టడాన్ని మినహాయించేందుకు తీవ్ర కృషి చేసినట్లు స్పష్టమవుతుంది.. సరిగ్గా అక్రమ నిర్మాణాన్ని వదిలేసి మార్కింగ్ చేయడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు..

మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, మే 8:

దుండిగల్ గండిమైసమ్మ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో కొంత 02-25 ఎకరాలు 2016లో సబ్ డివిజన్ 120/11లో ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాలకు తెలంగాణ ప్రభుత్వం కేటాయించింది., 2018 లో భూమి పూజ కార్యక్రమం చేపట్టినట్లు సమాచారం.. అప్పట్లో కొందరు కబ్జాదారులు అడ్డుకొని కోర్టును ఆశ్రయించడంతో ట్రైబల్ వెల్ఫేర్ వసతి గృహాల నిర్మాణానికి బ్రేక్ పడింది, అప్పటి నుండి సంబంధిత స్థలం ఖాళీగానే ఉంది.. గత రెండేళ్ళుగా కొద్దికొద్దిగా కబ్జాదారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి అక్రమంగా గదుల నిర్మాణం, కమర్షియల్ స్థలంలో తాజాగా అక్రమ షెడ్డు నిర్మించినా రెవెన్యూ అధికారులు చోద్యం చూడటం గమనార్హం.. సందిట్లో సడేమియాగా వ్యవహరిస్తున్న కొందరు ఫేక్ కోర్టు ఆర్డర్‌లు, మరొకరు ఒకచోట ఉన్న పట్టాలని ఇంకొక చోట, ఇంకొక కబ్జాదారులు ఫేక్ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి కటకటాల పాలైన భూ కబ్జాదారులు కూడా సర్వే నెంబర్ 120లో తిష్ట వేసుకుని కూర్చున్నారు..


అక్రమ నిర్మాణం తప్పించే విధంగా రెవెన్యూ మార్కింగ్..

గురువారం పెన్సినింగ్ ఏర్పాటులో రెవెన్యూ సహకరించిన విధానంపై ట్రైబల్ వెల్ఫేర్ మేడ్చల్ జిల్లా కమిషనర్ వినోద్ అసంతృప్తి వ్యక్తం చేశారు.. స్థానిక అధికారుల నిర్లక్ష్యంతోనే కబ్జాలకి గురైనట్లు గ్రహించారు.. కబ్జాదారులు, కోర్ట్ ఆర్డర్ అడ్డం పెట్టుకొని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని, ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులను సంప్రదించి అవసరమైతే హైడ్రా కమీషనర్‌కి నివేదిక పంపుతామన్నారు, సర్వే ఆధారంగా పెన్సినింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా మండల రెవెన్యూ అధికారుల నుండి సరైన సహకారం అందడంలేదన్నారు.



ట్రైబల్ వెల్ఫేర్ స్థలంలో కమర్షియల్ షెడ్లు..

# మిర్చి క్వింటాకు రూ.10,374

- మొదటి పేజి తరువాయి

ఖమ్మం, మహబూబ్‌నగర్, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, వరంగల్, హనుమకొండ, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో ఎక్కువగా మిర్చి సాగుచేస్తారు. సాగు ఖర్చులకన్నా మార్కెట్ ధర తక్కువగా ఉన్నందున రైతులు నష్టపోతున్నారని ఏప్రిల్ 4న కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు లేఖ రాసి ఆదుకోవాలని కోరాను. అందుకు స్పందించిన కేంద్ర వ్యవసాయశాఖ 2024-25లో తెలంగాణలో ఉత్పత్తి అయిన 6,88,540 మెట్రిక్ టన్నుల్లో 25 శాతానికి ఎంఐఎస్ వర్తింపజేస్తామని హామీ ఇచ్చింది. మార్కెట్-విక్రయ ధరల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని తొలుత రాష్ట్రప్రభుత్వం రైతుల ఖాతాలో జమచేస్తే కేంద్రం అందులో 50% మొత్తాన్ని రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది. ఈ పథకాన్ని కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు 50% చొప్పున భరించాల్సి ఉంటుంది. ఏపీఎంసీల్లో విక్రయించే మిర్చికి మాత్రమే ఈ పథకం కింద ప్రయోజనం లభిస్తుంది. కొన్నిచోట్ల దళారులు క్వింటా మిర్చిని రూ.5-6 వేలకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నట్లు తెలియడంతో కేంద్రం ఈ మేరకు చొరవ తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వం కూడా దీనిపై దృష్టిసారించి మిర్చి రైతులకు నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంఐఎస్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పథకాన్ని తెలంగాణలో అమలుచేయడానికి కేంద్రం సంసిద్ధత వ్యక్తంచేసిందని, ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర వ్యవసాయశాఖ ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు.

## గిరిజనులకు వరం.. ఇందిరా సౌరగిరి జలవికాసం

- మొదటి పేజి తరువాయి

తీసుకురావాలి. వారిని ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యంతో రూ.12,600 కోట్లతో ఈ పథకాన్ని చేపడుతున్నాం. వచ్చే ఐదేళ్లలో 2.10 లక్షల మంది రైతులకు 6 లక్షల ఎకరాల్లో సాగునీటిని అందించడానికి సౌరగిరి జలవికాస పథకం ఉపయోగపడుతుంది. దేశంలోని ఏ రాష్ట్రం కూడా పోడు భూములను సాగు చేసుకోవడానికి భారీగా నిధులు కేటాయించలేదు. ప్రభుత్వం ఈ పథకం కింద ఎంపిక చేసిన గ్రామాల్లో జల వనరుల కోసం జియోలాజికల్ సర్వే, బోర్లు వేయడం, సోలార్ పంపుసెట్లు బిగించడం, ప్లాంటేషన్, డ్రిప్ ఏర్పాటు తదితర పనులను చేపడుతుంది. అవకాడో, వెదురు, దానిమ్మ, డ్రాగన్, అంజీర్ వంటి పంటల సాగు, ప్రకృతిసిద్ధమైన సేద్యంపై గిరిజనులకు అవగాహన కల్పించాలి. పథకం అమలులో ఐటీడీఏ ప్రాజెక్టు, విద్యుత్తు, ఉద్యాన శాఖల అధికారుల పాత్ర కీలకం" అని భట్టి పేర్కొన్నారు. సమీక్షలో ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, వ్యవసాయ, గిరిజన సంక్షేమ శాఖల కార్యదర్శులు రఘునందన్‌రావు, శరత్, డిప్యూటీ సీఎం ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# నైపుణ్య శిక్షణ.. ఉద్యోగావకాశాలు

- మొదటి పేజి తరువాయి

ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న 3 వేలకు పైగా కంపెనీలు.. శిక్షణ పొందినవారిలో ప్రతిభావంతులను ఎంపిక చేసుకొని ఉద్యోగావకాశాలు కల్పిస్తాయి. విద్యా సంస్థలకు.. పరిశ్రమలకు మధ్య అంతరాన్ని తగ్గించడంలో ఈ ఒప్పందం దోహదపడుతుందని ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. సచివాలయంలో శ్రీధర్‌బాబు సమక్షంలో జేఎన్‌టీయూహెచ్ ఉపకులపతి టి.కిషన్‌కుమార్‌రెడ్డి.. టీసీఎస్ అయాన్ బిజినెస్ హెడ్(స్కిల్ ఎడ్యుకేషన్) స్మృతి ముల్యే ఎంఓయూపై సంతకం చేశారు. టీసీఎస్ అయాన్ గ్లోబల్ హెడ్ వెంగుస్వామి రామస్వామి టెలికాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

**మైలురాయిగా నిలుస్తుంది..**

గ్రామీణ యువతకు ఉద్యోగాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించడంలో ఈ ఒప్పందం మైలురాయిగా నిలుస్తుందని మంత్రి చెప్పారు. "భారతీయ యువతలో ఉద్యోగ నైపుణ్యాలు.. 2023లో 44.3 శాతం నుంచి 2024లో 42.6 శాతానికి తగ్గడం ఆందోళన కలిగించే అంశం. సగం మంది గ్రాడ్యుయేట్లు కూడా ఇప్పుడు ఉద్యోగ మార్కెట్‌లో డిమాండ్లకు తగ్గట్టుగా సిద్ధంగా లేరు. ఇది విద్యార్థులు, విద్యా సంస్థలు, పరిశ్రమలు, ప్రభుత్వం పనితీరును ప్రభావితం చేస్తుంది. రాష్ట్రంలో ఈ పరిస్థితి రాకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నాం. టీసీఎస్ అయాన్‌తో కలిసి మంథని జేఎన్‌టీయూలో విద్యార్థులకు అవసరమైన సాంకేతిక శిక్షణ ఇచ్చి, ఉద్యోగాలకు పోటీపడేలా సిద్ధం చేస్తున్నాం. ఈ సంస్థకు అనుబంధంగా ఉన్న 3 వేలకు పైగా కంపెనీల్లో వారికి ఉద్యోగావకాశాలూ లభిస్తాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నాం" అని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీ శాఖ సలహాదారు సాయికృష్ణ, టీసీఎస్ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# మేం సాధారణ పౌరులపై దాడి చేయలే.. పాకిస్థాన్ ప్రస్థానమే అబద్ధాలు: విక్రమ్ మిస్రీ



హైదరాబాద్ పెన్ పవర్: పహల్గాం ఉగ్రదాడి తర్వాతే భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు మొదలయ్యాయని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ పాక్ మధ్య చోటు చేసుకున్న పరిణామాలను గురువారం (మే 8) కేంద్ర విదేశాంగ, రక్షణ శాఖ సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించాయి. ఈ సందర్భంగా విక్రమ్ మిస్రీ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్?లో పాకిస్థాన్ పౌరులు చనిపోయారనేది అవాస్తవం. అలాగే, పాక్?లోని ప్రార్థనా స్థలాలపై మేం దాడులు చేయమనేది వాస్తవం కాదని క్లారిటీ ఇచ్చారు. పాకిస్థాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. అయినా పాకిస్థాన్ ప్రస్థానమే అబద్ధాలతో మొదలైందని.. అసత్య ప్రచారాలు చేయడం ఆ దేశానికి అలవాటేనని.. ఇది మాకు ఏమి ఆశ్చర్యం కలిగించలేదని ఎద్దేవా చేశారు. పహల్గాం దాడితో ఉద్రిక్తతలకు ఆజ్యం పోసింది పాకిస్థానేనని.. ఆపరేషన్ సిందూర్ పాక్ దుశ్చర్యకు సమాధానం మాత్రమేనని అన్నారు. మేం ఎక్కడా పాక్ మిలటరీ స్థావరాలపై దాడి చేయలేదని.. కేవలం ఉగ్రవాద స్థావరాలపైనే ఎటాక్ చేశామని క్లారిటీ ఇచ్చారు.

ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థే పహల్గాం దాడికి పాల్పడిన టీఆర్ఎఫ్. పహల్గాంలో దాడులకు పాల్పడింది తామేనని టీఆర్ఎఫ్ రెండు సార్లు ప్రకటించుకుంది. యూఎన్ కౌన్సిల్?లో టీఆర్ఎఫ్ రద్దును పాక్ వ్యతిరేకించింది. ఆల్ ఖైదీ వ్యవస్థాపకుడు బిన్ లాడెన్ ఎక్కడో దొరికాడో గుర్తు చేయాల్సిన అవసరం లేదు. అంతర్జాతీయ సమాజాన్ని పాక్ పక్క దారి పట్టిస్తోంది. అనేక మంది టెర్రరిస్టులకు ఆశ్రయం కల్పిస్తూ.. పైకి మాత్రం మాకు ఉగ్రవాదులతో సంబంధం లేదని బుకాయిస్తోంది.

పలు దాడుల్లో పట్టుబడ్డ ఉగ్రవాదులకు పాక్ ప్రమేయం ఉందని రుజువైంది. ప్రభుత్వ లాంఛనాలతో ఉగ్రవాదుల అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల వీడియోలు చూస్తే పాక్ వైఖరి ప్రపంచానికి అర్థం అవుతోంది. మతపరమైన ప్రదేశాలను పాక్ దుర్వినియోగం చేస్తోంది. భారత్ సింధు జలాల ఒప్పందం రద్దు చేసిందని పాక్ తప్పుడు ప్రచారం చేస్తోంది. కానీ పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడంతోనే సింధూ జలాల ఒప్పందం రద్దు చేశామని ఆయన తెలిపారు.

# ఇండియాలో బటన్ నొక్కుడు.. పాకిస్తాన్ లో పేలుడు : హార్పీ డ్రోన్స్ తో చెలరేగిపోతున్న ఇండియన్ ఆర్మీ




**హైదరాబాద్ పెన్ పవర్::**టెక్నాలజీ వాడకం అంటే ఇలా ఉండాలి.. యుద్ధ వ్యూహాలు అంటే ఇలా ఉండాలి.. ఇండియాలో బటన్ నొక్కితే పాకిస్తాన్ లో పేలుడు.. అవును.. ఇప్పుడు ఇండియా ఇలాగే చెలరేగిపోతుంది. పాకిస్తాన్ దేశానికి.. ఆ దేశ ఆర్మీకి చుక్కలు చూపిస్తుంది మన ఆర్మీ. దీనికి కారణం ఏంటో తెలుసా.. హార్పీ డ్రోన్స్.. ఈ డ్రోన్ బాంబ్స్ ద్వారా పాకిస్తాన్ రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తోంది ఇండియన్ ఆర్మీ. ఇప్పటికే హార్పీ డ్రోన్స్ ప్రమోగం ద్వారా.. పాకిస్తాన్ వైమానిక శాఖ.. ఎయిర్ ఫోర్స్ కు చెందిన రక్షణ వ్యవస్థలను కుప్పకూల్చింది ఇండియా. జస్ట్ 36 గంటల్లోనే.. హార్పీ డ్రోన్స్ ద్వారా 1600 కోట్ల విలువైన పాకిస్తాన్ ఎయిర్ ఫోర్స్ రక్షణ వ్యవస్థలను నాశనం చేసింది ఇండియన్ ఆర్మీ..

**చాలా సింపుల్ గా.. వ్యూహాత్మకంగా..**

చాలా చాలా సింపుల్ గా పాకిస్తాన్ ను కోలుకోలేని దెబ్బలు కొడుతుంది ఇండియన్ ఆర్మీ. పాకిస్తాన్ లోని ప్రదేశాన్ని టార్గెట్ ఫిక్స్ చేయటం.. ఆ తర్వాత ఇండియాలోనే ఉండి బటన్ నొక్కటం.. గాల్లోకి రువ్వున హార్పీ డ్రోన్ దూసుకెళ్లటం.. పాక్ లోని రక్షణ వ్యవస్థలను పేల్చేయటం.. అంతే.. పాకిస్తాన్ ఆర్మీ కళ్లు మూసి తెరిచే లోపు ఫినిష్ చేసేస్తోంది ఇండియన్ ఆర్మీ.

### ఏంటీ హార్పీ డ్రోన్స్.. దీని ప్రత్యేకతలు ఏంటీ..?

హార్పీ డ్రోన్.. 1989లో ఇజ్రాయెల్ తయారు చేసింది. సక్సెస్ అయ్యింది. ఈ తర్వాత నుంచి దీన్ని అప్ డేట్ చేస్తూ.. ఇప్పుడు ప్రపంచంలోనే అత్యంత శక్తి వంతమైన డ్రోన్ ఎటాక్ కు మారుపేరుగా మారిపోయింది.

ఒక్కసారి ఈ హార్పీ డ్రోన్ గాల్లోకి లేచింది అంటే.. పగలూ రాత్రీ అని తేడా లేదు.. 9 గంటలు నిర్విరామంగా పని చేస్తుంది.

హార్పీ డ్రోన్ టార్గెట్ రేంజ్ ఎంతో తెలుసా.. అక్షరాల వెయ్యి కిలోమీటర్లు.

ఎలాంటి వాతావరణ పరిస్థితుల్లో అయినా.. ఇది 100 శాతం కచ్చితత్వంతో టార్గెట్ రీచ్ అవ్వటం దీని స్పెషల్.

ఈ హార్పీ డ్రోన్.. రంగు ఆధారంగానూ టార్గెట్ రీచ్ అయ్యే విధంగా పని చేస్తుంది. అంతే కాదు ముందుకు, వెనక్కి ఎటు కావాలంటే అటు టార్గెట్ రీచ్ అయ్యేలోపు దిశలను మార్చుకునే వీలుంది. అంతే కాకుండా సెన్సార్లను చేధించుకుని వెళుతుంది. రాడార్ సైతం పసికట్టలేని విధంగా తన టార్గెట్ పూర్తి చేయటంలో హార్పీ డ్రోన్ స్పెషాలిటీ.

ఒక్కో హార్పీ డ్రోన్.. 23 కిలోల బరువైన పేలుడు పదార్థాలను మోసుకెళ్లగలదు. శత్రు దేశాల రాడార్, క్షిపణి, రహస్య స్థావరాలతోపాటు మొబైల్ వ్యవస్థలను స్తంభించజేయగలరు.. అంటే జామర్లుగానే పని చేయగలదు.

ఇదీ హార్పీ డ్రోన్ పని తీరు. ఇప్పుడు పాకిస్తాన్ దేశంలోని వైమానిక రక్షణ వ్యవస్థలను కుప్పకూల్చటంలో ఇండియా ఈ డ్రోన్లను ఉపయోగిస్తుంది. డ్రోన్లకు బాంబులు అమర్చటం.. ఇండియాలో బటన్ నొక్కటం.. పాకిస్తాన్ దేశంలో టార్గెట్ రీచ్ కావటం.. 48 గంటలుగా ఇండియా ఈ డ్రోన్ల సాయంతోనే.. పాకిస్తాన్ దేశానికి చుక్కలు చూపిస్తుంది.. ఇండియన్ ఆర్మీ చెలరేగిపోతుంది.. పాకిస్తాన్ కకావికలం అవుతుంది.

# బంగారం కొనేవారికి పన్ను అధికారుల నోటీసులు, ఈ విషయం తెలీదా..?




**హైదరాబాద్ పెన్ పవర్::** భారతీయులు పసిడి ప్రియులని మనందరికీ తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల్లో ఉండే వారి వరకు అందరూ బంగారం కొనేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. వివాహాలు, శుభకార్యాలు, వేడుకలు లేనప్పుడు సైతం చాలా మంది నిరంతరం గోల్డ్ కొంటూనే ఉన్నారు. అయితే తెలియక చేసే కొన్ని తప్పులు వారిని సమస్యల్లోకి నెట్టేస్తున్నాయి.

పన్ను అధికారులు నిర్ధేశించిన నియమాలను పాటించకపోతే నోటీసులు అందుకునే ప్రమాదం ఉంది. వాస్తవానికి బంగారం కొనుగోలుకు ఎలాంటి ప్రత్యేక పరిమితి నిబంధనలు లేనప్పటికీ.. నగదు ఉపయోగించి బంగారం కొనటంపై పరిమితులు ఉన్న సంగతి చాలా మందికి తెలియదు. రూల్స్ ప్రకారం ఒక రోజులో వ్యక్తులు రూ.2 లక్షలు మాత్రమే బంగారం కొనుగోలుకు నగదు రూపంలో చెల్లించటానికి వీలు కల్పించబడింది. దీనికంటే విలువైన లావాదేవీ చేసినప్పుడు క్రెడిట్ లేదా డెబిట్ కార్డులు, ఆన్ లైన్ చెల్లింపు విధానాలను ఉపయోగించాలని పన్ను చట్టాలు చెబుతున్నాయి. అలాగే షాపు యజమానులు సైతం ఇలాంటి అధిక విలువ కలిగిన నగదు చెల్లింపుల విషయంలో కస్టమర్ల వివరాలను సేకరించాల్సి ఉంటుంది. రూ.2 లక్షల కంటే విలువైన బంగారు ఆభరణాలను ఎవరైనా నగదు రూపంలో కొన్నప్పుడు వాటి వివరాలను నగల వ్యాపారులు ఆదాయపు పన్ను అధికారులకు అందించాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా అధికారులు సదరు వ్యక్తులకు నోటీసులు పంపి దర్యాప్తు చేసే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో నగల వ్యాపారులు కస్టమర్లకు సంబంధించిన పాన్, ఆధార్ వంటి పత్రాల వివరాలను సేకరించటం తప్పనిసరి. తద్వారా అధికారులు దర్యాప్తుకు వచ్చినప్పుడు వ్యాపారులు సైతం చిక్కుల్లో పడకుండా ఉంటారు. దర్యాప్తు సమయంలో నిబంధనలు పాటించనట్లు తేలితే వ్యాపారులపై పన్ను శాఖ జరిమానా కూడా విధిస్తుంది. అందుకే డబ్బుతో రూ.2 లక్షల కంటే ఎక్కువ విలువైన బంగారాన్ని కొనుగోలు చేయకపోవటం ఉత్తమం. ఇలాంటి సమయంలో డిజిటల్ చెల్లింపు విధానాలను వ్యక్తులు ఉపయోగించటం సమస్యలను తగ్గిస్తుంది.

# పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజీలు క్లోజ్.. భారత్ దెబ్బకు భారీ నష్టాలు..




**హైదరాబాద్ పెన్ పవర్::** ప్రస్తుతం పాకిస్థాన్ పరిస్థితి ఏమాత్రం బాగోలేదు. అటు ఆర్థికంగా చూసినా లేక ఇటు భద్రత పరంగా చూసినా పాక్ పూర్తిగా భూస్థాపితం అయ్యిందని తాజా పరిణామాల ద్వారా అర్థం చేసుకోవచ్చు. పాక్ నేతలు చేస్తున్న బెదిరింపులు కేవలం మేకపోతు గాంభీర్యం మాత్రమేనని అక్కడి స్థానికులు చెప్పటం వాస్తవ పరిస్థితులకు అద్దం పడుతోంది. ఇండియాలో పహల్గామ్ దాడి తర్వాతి నుంచి పాకిస్థాన్ లోని స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతూనే ఉన్నాయి. అక్కడి ప్రజలు సైతం యుద్ధం వస్తుందనే భయంతో ప్రాణాలు అరచేతినపట్టుకుని బ్రతుకుతున్నారు. అలాగే అత్యవసర పరిస్థితి ఏర్పడుతుందని భయంతో బ్యాంకుల నుంచి డబ్బును భారీగా విత్ డ్రా చేస్తున్నారు. అలాగే నెలలకు సరిపడా ఆహార పదార్థాలను ఇళ్లలో స్టాక్ చేసుకుంటున్నారని తెలుస్తోంది. అయితే నిన్న ఇండియా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ తర్వాతి నుంచి పాకిస్థాన్ స్టాక్ మార్కెట్లు భారీగా కుప్పకూలుతున్నాయి. భారత మంత్రులు సైతం సిందూర్ ఇంకా ముగిలేదని, దేశ రక్షణ కోసం అవసరమైతే మరిన్ని దాడులు చేపడతామని చెబుతున్న వేళ పాక్ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో గందరగోళం నెలకొంది. నిన్నటి పతనం తర్వాత నేడు గురువారం కూడా అక్కడి స్టాక్ మార్కెట్లు 7 శాతం క్షీణతను చూసింది. పరిస్థితులు ప్రస్తుతం దిగజారుతున్నందున పాకిస్థాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ట్రేడింగ్ నిలిపివేసినట్లు వెల్లడైంది. నేడు పాకిస్థాన్ లోని కరాచీ, లాహెూర్ సహా మరిన్ని నగరాల్లో పెద్ద పేలుళ్లు సంబవించిన తర్వాత పెట్టుబడిదారులు అమ డబ్బును వెనక్కి తీసుకునేందుకు భారీగా అమ్మకాలకు దిగటంతో మార్కెట్లు చివరికి మూతపడ్డాయి. ఈ క్రమంలో కేఎస్ఈ 100 సూచీ 6 శాతం నష్టపోయింది. అయితే దిగజారుతున్న పరిస్థితులతో ఇన్వెస్టర్లు తమ డబ్బును వెనక్తి తీసుకోవటానికి ఎక్కువగా మ్రొగ్గుచూపటమే దీనికి కారణంగా నిపుణలు చెబుతున్నారు. అలాగే ఐఎంఎఫ్ అందించే ప్యాకేజీపైనే పాక్ ఆర్థిక వ్యవస్థ ఎక్కువగా ఆధారపడటంతో పరిస్థితులు అక్కడ రోజురోజుకూ దిగజారుతున్నాయి.

# కూలిన హెలికాప్టర్.. నలుగురు దుర్మరణం

**హైదరాబాద్ పెన్ పవర్::** చార్‌ధామ్ యాత్ర కోసం బయల్దేరిన హెలికాప్టర్ కూలిపోయింది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకా శి జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో నలుగురు సజీవదహనమయ్యారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని తెలిసింది. ఈ మేరకు గర్వాల్ డివిజనల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ప్రమాదాన్ని ధృవీకరించారు. ఉత్తరకాశి జిల్లాలోని గంగానిలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, పరిపాలన, %NDRF-SDRF% బృందా లు సంయుక్తంగా సహాయక చర్యలను చేపట్టాయి.ప్రమాద స్థలంలో మృతదేహాలను స్వాదీనం చేసుకుని పోస్ట్ మార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిని చికిత్స కోసం ఆసుపత్రిలో చేర్చారు. హెలికాప్టర్ ముక్కలు, ముక్కలుగా పేలిపోయింది. ఆ హెలికాప్టర్ ప్రైవేట్ కంపెనీ ఏరో ట్రింక్ కు చెందినదిగా తెలిసింది. ఏడుగురు ప్రయాణికులతో వెళుతుండగా ప్రమాదానికి గురైంది.ఉత్తరకాశీ జిల్లాలో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంపై ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి విచారం వ్యక్తం చేశారు.

# చైనా సరుకుతో యుద్ధం చేయలేమంటున్న పాక్ ఆర్మీ: తుస్సుమంటున్న చైనా బాంబులు, మిస్సైల్స్

**హైదరాబాద్ పెన్ పవర్::**పాకిస్తాన్ రక్షణ వ్యవస్థ టార్గెట్?గా ఇండియా చేస్తున్న దాడులతో అల్లకల్లోలంగా మారింది పాక్ ఆర్మీ. ఇప్పటికే లాహోర్?లోని ఆర్మీ వైమానిక స్థావరాల్లో.. ఎంతో ఘనంగా.. పాక్ ఆర్మీని కాపాడతాయనుకుని పెట్టుకున్న చైనా సెక్యూరిటీ భద్రత వ్యవస్థ తుస్సు అన్నది.

దీనికితోడు చైనా నుంచి కొనుగోలు చేసిన మిస్సైల్స్, బాంబులు వంటి యుద్ధ సామాగ్రి, పరికరాలను ఉపయోగించే సత్తా కూడా పాక్ సైనికుల దగ్గర లేకపోవటం అనేది.. ఆపరేషన్ సింధూర్?తో వెలుగులోకి వచ్చింది. భారత్ నుంచి వస్తున్న డ్రోన్లు, మిస్సైల్స్?ను సైతం పసిగట్టలేని విధంగా చైనా యుద్ధ సామాగ్రి ఉండటంతో.. ఇలాంటి చైనా సరుకుతో యుద్ధం చేయలేం అంటూ పాక్ సైనికులు చేతులెత్తేశారనే వార్తలు వస్తున్నాయి. చైనా కూడా డబ్బుల కోసం పాకిస్థాన్?కు యుద్ధ సామాగ్రి అయితే అమ్మింది కానీ.. వాటిని ఎలా ఉపయోగించాలో నేర్పించలేదు. ఆర్భాటంగా చైనా నుంచి కొనుకున్న మిస్సైళ్లు, ఇతర యుద్ధ పరికరాలు ఎలా వాడాలో కనీస అవగాహన లేకపోవడంతో భారత్ చేస్తోన్న దాడులకు ప్రతిదాడి కాదు కదా.. కనీసం అడ్డుకోలేకపోతుంది పాక్ ఆర్మీ. ఆపరేషన్ సిందూర్?తో పాకిస్థాన్, పీవోకేలోని ఉగ్రస్థావరాలపై భారత్ విరుచుకుపడుతోంది. దీంతో తమకు సోదరుల్లాంటి ఉగ్రవాదులను కాపాడటం కోసం పాక్ ఆర్మీ శతవిధాల ప్రయత్నిస్తోంది.




భారత మిస్సైళ్లు, బాంబులు, డ్రోన్లను అడ్డుకునేందుకు బార్డర్ల వద్ద రక్షణ వ్యవస్థలను మోహరించడంతో పాటు చైనా నుంచి కొనుగోలు చేసిన డ్రోన్లు, మిస్సైళ్లతో భారత్?పై దాడులు చేసింది. భారత్ మిస్సైళ్లతో విరుచుకుపడుతుండటంతో వాటిని అడ్డుకుని ధ్వంసం చేసేందుకు చైనా నుంచి కొనుగోలు చేసిన హెచ్ క్యూ -9 అనే గగనతల రక్షణ వ్యవస్థను సరిహద్దుల్లో మోహరించింది పాక్. ఇదే సమయంలో చైనా అందించిన మిస్సైళ్లు, బాంబులు, డ్రోన్లతో భారత్ లోని పలు ప్రాంతాల్లోకి దాడులకు పాల్పడింది. పాక్ దాడులను భారత ఎస్-400 క్షిపణి వ్యవస్థ సమర్ధవంతంగా అడ్డుకుంది.

పాకిస్థాన్ మిస్సైళ్లు, డ్రోన్లను గాల్లోనే ధ్వంసం చేసింది. అలాగే.. బోర్డర్లలో పాక్ మోహరించిన హెచ్ క్యూ -9 రక్షణ వ్యవస్థను ఛేదించి దాయాది దేశంపై భారత్ దాడులు చేసింది. దీంతో చైనా నుంచి పాక్ కొనుగోలు చేసిన హెచ్ క్యూ -9 గగనతల రక్షణ వ్యవస్థ, మిస్సైళ్లపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. పాక్ ఆశలన్నీ చైనా యుద్ధ పరికరాలపైనే. కానీ కీలక సమయంలో అవి తేలిపోవడంతో పాక్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ క్రమంలోనే హెచ్ క్యూ - 9 గగనతల రక్షణ వ్యవస్థ గురించి, పాక్ మిస్సైళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్న భారత ఎస్-400 క్షిపణి వ్యవస్థ గురించి సోషల్ మీడియాలో చర్చ మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఈ రెండు గగనతల రక్షణ వ్యవస్థల గురించి పూర్తిగా వివరాలు అందిస్తున్నాం.

**హెచ్ క్యూ -9**

హెచ్ క్యూ -9 అనే గగనతల రక్షణ వ్యవస్థను భారత సరిహద్దుల్లో పాకిస్థాన్? మోహరించింది. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత్ ప్రయోగించిన మిస్సైళ్లను ఇది గుర్తించినా అడ్డుకోలేకపోయింది. రష్యా వద్ద ఎస్-300 అనే మిస్సయిల్ ఉంది. అచ్చం దానిలో ఉన్న ఫీచర్లే, చైనా ఆర్మీ తయారు చేసిన ఈ క్షిపణిలోనూ ఉన్నాయని అంటారు. దీన్నే పాకిస్థాన్? సైన్యానికి చైనా విక్రయించింది. పాకిస్తాన్ పై భారత్ డ్రోన్ దాడి చేయగా ఈ నాసిరకం క్షిపణి అడ్డుకోలేక పోయింది. దీంతో చైనాకు చెందిన హెచ్ క్యూ -9 పనితీరు ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది.

**భారత్ అమ్ముల పొదిలో.. సుదర్శన చక్రం**

ఎస్ 400.. ఇది భారత్ అమ్ముల పొదిలో సుదర్శన చక్రం. ఎయిర్ డిఫెన్స్ మిస్సైల్ వ్యవస్థలో ఇది కీలకం. వీటిని రష్యా నుంచి భారత్ దిగుమతి చేసుకుంది.ఇండియా పాక్ హై టెన్షన్ సమయంలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌కి ఇవి గేమ్ ఛేంజర్ గా మారింది. భారత్%-% పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న ప్రస్తుత సమయంలో ఎస్-400 క్షిపణి వ్యవస్థను బార్డర్‌లో మోహరించారు. దీని పరిధి 40 నుంచి 400 కి.మీ. మధ్య ఉంటుంది. ఈ పరిధిలో శత్రువు క్షిపణి, డ్రోన్లు వస్తే వాటిని గాల్లోనే పేల్చివేస్తుంది. దేశంలోని 15 ప్రాంతాల్లో దాడులు చేయాలని భావించిన పాకిస్తాన్ కు ఈ సుదర్శన చక్రం అడ్డుగా వెళ్లింది.

## ఆపరేషన్ సిందూర్‌లో అదానీ డ్రోన్స్ వాడిన ఆర్మీ.. ప్రత్యేకతలు ఇవే..




**హైదరాబాద్ పెన్ పవర్::** నిన్న తెల్లవారుజామున మొదటి దాడిని చేపట్టిన భారత్ ఆపరేషన్ సిందూర్ ను ప్రస్తుతం కొనసాగిస్తోంది. ఇండియాలోని అనేక నగరాలపై పాక్ సైన్యం మిస్సైల్ దాడులకు తెగబడతా వాటిని సమర్ధవంతంగా తిప్పికొడుతూనే డ్రోన్ల సాయంతో మరిన్ని దాడులకు భారత్ దిగిందని వెల్లడైంది. ఈ క్రమంలో పాక్ ఆర్మీ హెడ్ క్వార్టర్, రావల్పిండి క్రికెట్ స్టేడియంపై కూడా డ్రోన్ దాడులను నిర్వహించింది. అయితే ఇప్పుడు అందరి దృష్టి భారత సాయుధదళాలు సిందూర్ దాడుల్లో ఉపయోగించిన డ్రోన్లపై పడింది. వివరాల్లోకి వెళితే ప్రస్తుతం దాడుల్లో ఉపయోగిస్తున్న స్కై స్ట్రైకర్స్ అనే అధునాతన డ్రోన్లను అదానీకి చెందిన ఆల్ఫా సిస్టమ్స్ సంస్థ తయారు చేసినవి కావటం గమనార్హం. 2018లో అదానీ గ్రూప్ ఈ కంపెనీని స్థాపించగా.. భారత ఆర్మీ రక్షణకోసం వీటిని సరఫరా చేస్తోంది. వీటిలో 5 కేజీలు లేదా 10 కేజీల మందుగుండును తీసుకువెళ్లేందుకు వీలుగా డిజైన్ చేసినట్లు వెల్లడైంది. ప్రస్తుతం స్కై స్ట్రైకర్ డ్రోన్లను బెంగళూరులో అదానీ గ్రూప్ సంస్థ ఇజ్రాయెల్ కు చెందిన ఎల్బిట్ సెక్యూరిటీ సిస్టమ్స్ సంయుక్తంగా తయారు చేస్తున్నాయి. ఇది 100 కిలోమీటర్ల పరిధిలో ఉండే శత్రునిర్మాణాలపై దాడి చేసేందుకు రూపొందించబడ్డాయని వెల్లడైంది. 2021 నుంచి అత్యవసర నిర్ణయంతో 100 డ్రోన్లను భారత మిలిటరీ ఆర్డర్ చేసింది. ప్రస్తుతం ఈ అత్యాధునిక ఇజ్రాయెల్ సాంకేతికత కలిగిన డ్రోన్లు సిందూర్ పేరుపై చేస్తున్న ఆపరేషన్లో కీలక పాత్ర పోషిస్తూ భారతదేశానికి విజయాన్ని అందిస్తున్నాయి. సాయుధ దళాలు శత్రువులపై చేస్తున్న దాడుల్లో ఖచ్చితత్వంతో పాటు విజయాన్ని సాధించటానికి స్కై స్ట్రైకర్స్ అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నాయని మిలిటరీ నిపుణులు చెబుతున్నారు. దీంతో భారత్ తన భూభాగం నుంచి శత్రుదేశంలోని కీలకమైన ఉగ్ర స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసేందుకు వీలు కలుగుతోంది.

## మా సహనాన్ని ప రీక్షించకండి.. లేదంటే ప్రతిదాడికి సిద్ధంగా ఉండండి: పాక్‌కు మంత్రి రాజ్‌నాథ్ సింగ్ వార్నింగ్

**హైదరాబాద్ పెన్ పవర్::** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతల వేళ భారత రక్షణ శాఖ మంత్రి రాజ్?నాథ్ సింగ్ మరోసారి హాట్ కామెంట్స్ చేశారు. గురువారం (మే 8) ఢిల్లీలో జరిగిన నేషనల్ క్వాలిటీ కాన్క్లేవ్‌లో ఆయన మాట్లాడుతూ..



భారతదేశ సహనాన్ని పరీక్షించవద్దని పాకిస్థాన్?ను హెచ్చరించారు. భారత్?ను రెచ్చగొడితే.. ఆపరేషన్ సిందూర్ వంటి నాణ్యమైన ప్రతిస్పందనకు సిద్ధంగా ఉండాలని దాయాది దేశానికి వార్నింగ్ ఇచ్చారు."మేము ఎల్లప్పుడూ బాధ్యతాయుతమైన దేశంగా చాలా సంయమనంతో వ్యవహరించాము. ద్వైపాక్షిక చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడాన్ని మేము నమ్ముతాం. కానీ ఎవరైనా మా సహనాన్ని పరీక్షిస్తే ఉపేక్షించం. భారత్ రెచ్చగొట్టే వారు ఆపరేషన్ సిందూర్ వంటి కౌంటర్ ఎటాక్?కు రెడీగా ఉండాలి" అని రాజ్?నాథ్ సింగ్ వ్యాఖ్యానించారు. పహల్గాం దాడికి కౌంటర్?గా చేపట్టిన ఆపరేషన్ సిందూర్?లో మన సాయుధ దళాలు ప్రదర్శించిన ధైర్యానికి వారిని అభినందిస్తున్నానని అన్నారు. పాకిస్తాన్, పీఓకెలోని ఉగ్రవాద శిబిరాలను మన భద్రతా దళాలు నాశనం చేసిన విధానం మనందరికీ గర్వకారణమన్నారు. ఆపరేషన్ సిందూర్?లో భాగంగా పాకిస్తాన్, పీఓకెలోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలు నేలమట్టం చేశామని.. పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ ఆపరేషన్ ఊహించలేని ఖచ్చితత్వంతో అమలు చేయబడిందని.. ఈ ఆపరేషన్ అమాయకులకు ఎటువంటి హాని జరగకుండా నిర్వహించబడిందని క్లారిటీ ఇచ్చారు. ఈ విజయానికి భారత సాయుధ దళాల వృత్తి నైపుణ్యం, అత్యాధునిక యుద్ధ పరికరాలే కారణమని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోందని.. పీవోకేలోని ఉగ్రవాదులను ఏరి వేస్తున్నామని తెలిపారు. మా దేశ సారభౌమత్వాన్ని సవాల్ చేస్తే ఊరుకోమని.. దాడులకు ప్రతిదాడులు తప్పవని భారత దేశ వైఖరిని స్పష్టంగా చెప్పారు.

## కొనసాగుతున్న ఆపరేషన్

**హైదరాబాద్ పెన్ పవర్:**మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కర్రెగుట్టలు మరింత దూకుడుగా కొనసాగుతోంది. తెలంగాణ – బీజాపూర్ సరిహద్దుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. భద్రతా బలగాల కాల్పుల్లో కీలక మావోయిస్టుల నేతలు హతమయ్యారు. బీజాపూర్ జిల్లా ఉసూరు బ్లాక్ లంకపల్లి అటవీ ప్రాంతంలో ఎన్‌కౌంటర్ జరిగింది. ఈ కాల్పుల్లో మావోయిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న, ఎస్.జెడ్.సీ.మెంబర్ బండీ ప్రకాశ్ సహా 8 మంది మావోయిస్టులు హతమైనట్లు సమాచారం. అయితే ఎన్ కౌంటర్ మృతులపై పోలీసు అధికారులు ప్రకటన చేయాల్సి ఉంది. ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోంది.ఛత్తీస్‌గఢ్ – తెలంగాణ సరిహద్దు బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి కూడా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిన్న కూంబింగ్‌కు వెళ్లిన భద్రతా బలగాలకు పది మందితో కూడిన మావోయిస్టులు తారసబడ్డట్టు తెలుస్తోంది. వారిలో మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు చంద్రన్న కూడా ఉన్నట్లు సమాచారం. ఈ విషయాన్ని ఇంకా ధృవీకరించాల్సి ఉంది. ఈ ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘాలు కూడా ఆరా తీస్తున్నాయి. చంద్రన్న చాలా కీలకమైన నేత. తెలంగాణకు సంబంధించి నాయకత్వంలో చంద్రన్న, రాష్ట్ర కార్యదర్శి దామోదర్ కీలక భూమిక పోషిస్తున్నారు. కర్రెగుట్టల్లో ఉన్న గుహలు చంద్రన్న ఆధ్వర్యంలోనే ఆపరేషన్ అంతా కొనసాగినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే చంద్రన్న కూడా ఈ ఎన్‌కౌంటర్‌లో చనిపోయినట్లు సమాచారం. కానీ భద్రతా బలగాలు, పోలీసులు దీనిని ఇంకా ధృవీకరించడం లేదు.అయితే ఆపరేషన్ కగార్‌కు తెలంగాణకు ఎటువంటి సంబంధం లేదని ఈ మధ్యకాలంలో తెలంగాణ నేతలు, మంత్రి సీతక్కతో పాటు ఓ మీడియా చిట్‌చాట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా చెప్పిన విషయం తెలిసిందే. ఇప్పుడు జరిగిన ఎన్‌కౌంటర్ తెలంగాణ పోలీసులకు తెలిసి జరిగిందా లేదంటే కేంద్ర భద్రతా బలగాల ఆధ్వర్యంలో జరిగిందా అనేది తెలియాల్సి ఉంది.

## సరిహద్దులో టెన్షన్.. టెన్షన్.. రంగంలోకి యుద్ధ విమానాలు



**హైదరాబాద్ పెన్ పవర్:**
:ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్– పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. డ్రోన్స్ తో భారత్ పై దాడులకు పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. పాక్ దాడులను భారత ఆర్మీ తిప్పికొడుతోంది. రంగంలోకి దిగిన భారత యుద్ధవిమానాలు.. గగనతలంలో నిరంతరం గస్తీ కాస్తున్నాయి. అలాగే, మిసైల్ డిఫెన్స్ వ్యవస్థలను కేంద్రం యాక్టివేట్ చేసింది. మరోవైపు, నియంత్ర రేఖ వెంబడి పాక్ సైన్యం కాల్పులకు తెగబడుతోంది.ఈ క్రమంలో పాక్ సరిహద్దు రాష్ట్రాల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నారు. సరిహద్దు దగ్గర అనుమానాస్పదంగా కనిపిస్తే కాల్చివేసేలా భారత ఆర్మీ ఉన్నతాదికారులు ఉత్తర్వులు జారీ చేశారు. మే 9 వరకు సరహద్దు ప్రాంతాలైన జోధ్‌పూర్, బికనేర్, కిషన్‌ఘర్ విమానాశ్రయాల మూసివేస్తున్నట్లు తెలిపారు. పంజాబ్ సరిహద్దులోని ఆరు జిల్లాల్లో పాఠశాలల మూసివేశారు.

# పాకిస్తాన్ దాడులను తిప్పికొట్టిన భారత్
# 15 ప్రాంతాల్లో దాడులకు యత్నం

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ 2025 మే 7–8 తేదీ రాత్రి డ్రోన్లు, క్షిపణులను ఉపయోగించి అవంతిపూర్, శ్రీనగర్, జమ్మూ, పఠాన్‌కోట్, అమృత్‌సర్, కపూర్థల, జలంధర్, లూధియానా, ఆదంపూర్, భట్టిండ, చండీగఢ్, నల్, ఫలౌది, ఉత్తరలై, భుజ్‌తో సహా ఉత్తర, పశ్చిమ భారతదేశంలోని అనేక సైనిక స్థావరాలపై దాడి చేయడానికి ప్రయత్నించింది.భారత సైన్యం యుఎస్ గ్రిడ్, వాయు రక్షణ వ్యవస్థ ద్వారా ఈ దాడులను అడ్డుకుంది. ఈ దాడుల శిథిలాలు ఇప్పుడు అనేక ప్రదేశాల నుంచి స్వాధీనం చేసుకుంది. ఇవి పాకిస్తాన్ దాడులను నిర్ధారిస్తున్నాయి. దీంతో పాకిస్తాన్‌లోని అనేక ప్రదేశాల్లో వాయు రక్షణ రేడార్, ఇతర వ్యవస్థలను భారత సాయుధ దళాలు లక్ష్యంగా చేసుకున్నాయి. కీలకమైన సోర్స్ ప్రకారం, భారత సైన్యం లాహోర్‌లోని ఒక వాయు రక్షణ వ్యవస్థను ధ్వంసం చేసింది.భారతదేశం ఈ దాడికి అదే శైలిలో అదే తీవ్రతతో, అదే ప్రాంతంలో ప్రతీకారం తీర్చుకుంది. ఈ ఉదయం భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని అనేక వాయు రక్షణ రేడార్, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. లాహోర్‌లోని ఒక వాయు రక్షణ వ్యవస్థ పూర్తిగా డీయాక్టివ్ అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. భారతదేశం ఇప్పటికే పాకిస్తాన్‌లోని ఏ సైనిక ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకోలేదు. ఇదే విషయాన్ని తన ప్రకటనలో కూడా చెప్పింది. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని పెంచడం భారత్ ఆలోచన కాదని కూడా తెలిపింది. ఇది కేవలం ఉగ్రవాదుల స్థావరాలను ధ్వంసం చేయడమేనని పేర్కొంది. పహల్గామ్ సహా దేశంలో జరిగిన ఉగ్రదాడులకు ప్రతీకారంగానే ఈ దాడి చేసినట్టు వెల్లడించింది. డ్రోన్లు, క్షిపణులను ఇంటిగ్రేటెడ్ కౌంటర్ %ఖూూ% గ్రిడ్, వైమానిక రక్షణ వ్యవస్థలు ఛేదించామని మంత్రిత్వ శాఖ తెలిపింది. "ఈ దాడులతో వెలుగు చూసిన శిథిలాలు పాకిస్తాన్ దాడులను రుజువు చేస్తున్నాయని. వీటిని అనేక ప్రదేశాల నుంచి స్వాధీనం చేసుకుంటున్నారు" అని ప్రభుత్వం తెలిపింది.భారత్‌లోని సైనిక స్థావరాలను టార్గెట్ చేసినందుకు రియాక్షన్ అంతే సీరియస్‌గా ఉంది. గురువారం భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని అనేక ప్రదేశాలలో ఉన్న వైమానిక రక్షణ రాడార్లు మరియు వ్యవస్థలను లక్ష్యంగా చేసుకుని లాహోర్‌లోని వైమానిక రక్షణ వ్యవస్థను విజయవంతంగా నాశనం చేసినట్టు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. %నాు%9 యూనిట్లపై భారత్ దాడి చేసింది. దీంతో పాకిస్థాన్‌కు వందల కోట్ల నష్టం వాటిల్లినట్టు తెలిసింది. %నాు%-9 వాయు రక్షణ వ్యవస్థ నాశనం పాకిస్తాన్‌కు పెద్ద దెబ్బగా చెప్పవచ్చు. దీని ప్రతిధ్వని బీజింగ్ నుంచి ఇస్లామాబాద్ వరకు వినిపిస్తోంది. సోర్స్ ప్రకారం, పాకిస్తాన్ సైన్యం %నాు%-9 క్షిపణి రక్షణ వ్యవస్థ యూనిట్లు డ్రోన్ దాడుల్లో భారీ నష్టాలను చవిచూశాయి. లాహోర్, సియాల్‌కోట్, గుజ్రాన్‌వాలా, రావల్పిండి, చక్వాల్, బహవల్పూర్, మియాన్‌వాలి, కరాచీ, చోర్, మియానో, అటాక్‌లలో ఇటువంటి డ్రోన్ దాడులు జరిగాయి, దీనిలో అదింగా నష్టం జరిగినట్టు తెలుస్తోంది. "భారత సాయుధ దళాలు పాకిస్తాన్‌లోని అనేక ప్రదేశాల్లో వైమానిక రక్షణ రాడార్లు, వ్యవస్థలను లక్ష్యంగా చేసుకున్నాయి. పాకిస్తాన్ మాదిరిగానే భారత రియాక్షన్ అంతకు మించి ఉంది. లాహోర్‌లోని వైమానిక రక్షణ వ్యవస్థను నార్మలైజ్ చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది" అని రక్షణ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

%ూాజ%లో మళ్ళీ కాల్పులు

పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలను పేల్చిన తర్వాత నుంచి పాకిస్థాన్‌లో భయం మరింత పెరిగింది. ఎలాగైనా భారత్‌ను దెబ్బకొట్టాలని కుట్రలు చేస్తోంది. ఏదో రూపంలో అలజడి సృష్టించాలని పన్నాగాలు పన్నుతోంది. ఎల్‌ఓసీలో కాల్పులకు తెగబడుతోంది. అమాయక ప్రజలను టార్గెట్ చేసుకుంటోంది. కుప్వారా, బారాముల్లా, పుంచ్, మెండర్, రాజౌరి వంటి ప్రాంతాల్లో పాకిస్తాన్ మోర్టార్, భారీ ఆర్టిలరీతో కాల్పులు జరిపింది. ఈ దుష్ట కాల్పులలో 16 మంది అమాయక భారతీయ పౌరులు మరణించారు, వారిలో ముగ్గురు మహిళలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు.భారతదేశ తన ఆలోచనను స్పష్టంగా చెప్పింది. "మేము పరిస్థితిని మరింతగా ఉద్రిక్తంగా మార్చాలని అనుకోవడం లేదు. కానీ ప్రతీకారం తీసుకోవడం మాకు తెలుసు అనే విషయాన్ని చెప్పడానికే కేవలం ఉగ్ర స్థావరాలను మాత్రమే టార్గెట్ చేసుకున్నాం." అని భారత సైన్యం స్పష్టం చేసింది. భారతదేశం యుద్ధం కోరుకోవడం లేదు. కానీ సైనిక స్థావరాలపై, పౌరులపై దాడి జరిగితే మాత్రం ప్రతీకారం తీసుకోవడంలో వెనుకడుగు వేసే ప్రసక్తి లేదని పాకిస్థాన్‌కు చెప్పకనే చెప్పింది. అందుకే ఎల్‌ఓసీలో పాకిస్తాన్ జరుపుతున్న కాల్పులకు తగిన విధంగా సమాధానం చెబుతోంది భారత్ ఆర్మీ.

# లిక్కర్ స్కాం... ఈడీ కేసు

**హైదరాబాద్ పెన్ పవర్:)**
ఆంధ్రప్రదేశ్ రాజకీయవర్గాల్లో పెను సంచలనంగా మారిన లిక్కర్ స్కాంలో ఈడీ ఎంట్రీ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. సీఐడీ సిట్ దర్యాప్తు చేస్తున్నకేసుకు సంబంధించి పూర్తి వివరాలు ఇవ్వాలని ఈడీ లేఖ రాసింది. నిందితులను విచారించడానికి విజయవాడ సీపీ అనుమతి కోరుతూ లేఖ రాసింది. ఎఫ్ఐఆర్ తో పాటు సీజ్ చేసిన బ్యాంక్ అకౌంట్ల వివరాలుతో అరెస్టు చేసిన వారి డీటైల్స్.. దర్యాప్తులో తేలిన నగదు లావాదేవీల వివరాలుతో సహా మొత్తం వివరాలు అందించాలని ఈడీ కోరింది. పీఎంఎల్ఏ సెక్షన్ కింద కేసులు నమోదు చేయనున్నారు. ఏపీలో లిక్కర్ స్కాంలో నగదు లావాదేవీలు చేయడం ద్వారా మొత్తం స్కాంను నడిపించారని సీఐడీ సిట్ చెబుతోంది. ఈ వ్యవహారంలో సీఐడీ సిట్ చాలా వరకూ వివరాలు సేకరించింది. వరుసగా అరెస్టులు చేస్తోంది. ఈ కేసులో కీలకమైన వ్యక్తులుగా ఉన్న ధనుంజయ రెడ్డి, కృష్ణమోహన్ రెడ్డి, గోవిందప్ప బాలాజీ తమను అరెస్టు చేయకుండా




చూడాలని సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఆ పిటిషన్ ను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దీంతో వారి కోసం సిట్ వెదుకుతోంది. వారు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. వారి ఇళ్లల్లో సిట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నఈ కేసులో ఈడీ దర్యాప్తు కోసం చాలా కాలంగా ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. గతంలో అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా ఈ కేసును ఈడీకి రిఫర్ చేస్తున్నట్లుగా చెప్పారు. అవినీతి వ్యవహారంలో రాష్ట్ర సిట్ చర్యలు తీసుకుంటుంది. వేల కోట్ల మనీలాండరింగ్ ఇష్యూలో.. ఈడీ చర్యలు తీసుకుంటుంది. ఆర్థికలావాదేవీలు, అక్రమ నగదు లావాదేవీట్కలు, సూట్ కేసు కంపెనీల గుట్టు ఇప్పటికే బయటపడటంతో నిందితులు అంతా ఇరుక్కుపోయినట్లుగా భావిస్తున్నారు. మరో వైపు ఈ కేసులో సీబీఐ విచారణ చేయించాలని టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ లేఖ రాశారు. సీబీఐకి రాసిన అధికారిక లేఖలో విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ రూ.3600 కోట్లకు పైగా విలువైన భారీ మద్యం కుంభకోణంపై నిష్పాక్షిక దర్యాప్తు జరపాలని కోరారు. రాష్ట్ర వనరులు మరియు ప్రజారోగ్యానికి సంబంధించిన ఇంత భారీ కుంభకోణం ఎలా అదుపు లేకుండా పోయిందని ప్రశనించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు నిజం తెలుసుకునే హక్కు ఉందని.. నిందితుల్ని కఠినంగా శిక్షించాల్సి ఉందన్నారు. ఈ కుంభకోణం తీవ్రత, పరిమాణం , అంతర్రాష్ట్ర ఆర్థిక చిక్కులను దృష్టిలో ఉంచుకుని, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (%జదీ×%) వెంటనే దర్యాప్తును చేపట్టి, సమగ్రమైన నిష్పాక్షికమైన దర్యాప్తును కోరారు.

## ఆపరేషన్ సింధూర్... ఇంకా ఉంది

# కేంద్రానికి ఆల్ పార్టీ మద్దతు

**హైదరాబాద్ పెన్ పవర్:**పాకిస్తాన్‌పై 'ఆపరేషన్ సింధూర్' ఇప్పటికీ కొనసాగుతోందని, సరిహద్దు వద్ద పరిస్థితి వేగంగా మారుతోందని.. పొరుగు దేశంతో కొనసాగుతున్న వివాదం గురించి రాజకీయ పార్టీలకు కేంద్రం తెలిపింది. ఆపరేషన్ సింధూర్, భారత్ %-% పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తలపై ఢిల్లీలో గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశం ముగిసింది. పార్లమెంట్ అనెక్స్ భవనంలో రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ నేతృత్వంలో ఈ అఖిలపక్ష సమావేశం జరిగింది.. ఆపరేషన్ సిందూర్ విజయాన్ని కేంద్ర ప్రభుత్వం అఖిలపక్షానికి వివరించింది. ప్రభుత్వం తరఫున అఖిలపక్ష సమావేశానికి రాజ్ నాథ్ సింగ్ తోపాటు అమిత్ షా, జేపీ నడ్డా, కిరణ్ రిజుజు హాజరయ్యారు. అఖిలపక్ష సమావేశంలో మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, లావు శ్రీకృష్ణ దేవరాయలు, మిథున్ రెడ్డి సహా వివిధ పార్టీల పార్లమెంటరీ పక్ష నేతలు హాజరయ్యారు. ఆపరేషన్ సిందూర్ సైనిక చర్య, తదుపరి పరిణామాలు, దేశ భద్రతా చర్యలను రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ ప్రతిపక్షాలకు వివరించారు.ఈ సందర్భంగా రాజనాథ్ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ లో పాకిస్తాన్, పీఓకేలో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని వెల్లడించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి చర్యలకైనా సిద్ధం అని స్పష్టంచేశారు.ఈ సమావేశంలో, పాకిస్తాన్‌పై ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందని, సరిహద్దులో పరిస్థితి ఇంకా అలానే ఉందని రక్షణ మంత్రి నాయకులకు తెలియజేసినట్లు వర్గాలు తెలిపాయి. మే 7న పీఓకే-పాకిస్తాన్‌లోని పంజాబ్‌లోని 21 లక్ష్యాలపై జరిగిన ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌లపై సైనిక దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు మరణించారని కూడా ఆయన చెప్పారు.ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారని, ఆపరేషన్ సిందూర్ గురించి అందరికీ వివరించారని, అందరు నాయకులు తమ సూచనలను అందించారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు."మనమందరం కలిసి పనిచేస్తున్న సమయంలో నాయకులందరూ




పరిణతి ప్రదర్శించారు. ఆపరేషన్ సిందూర్ కోసం అందరూ సాయుధ దళాలను ప్రశంసించారు.. అభినందించారు .. మేము ప్రభుత్వానికి, సాయుధ దళాలకు మద్దతు ఇస్తామని చెప్పారు. మాకు కొన్ని సూచనలు కూడా వచ్చాయి " అని ఆయన అన్నారు.అఖిలపక్ష సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిరన్ రిజిజు మాట్లాడుతూ "ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోంది. దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. నేటి సమావేశానికి హాజరైన అన్ని పార్టీల నేతలు భారత సైన్యాన్ని అభినందించారు, వారి ధైర్య సాహసాలను మెచ్చుకున్నారు. అన్ని రాజకీయ పార్టీలు ప్రభుత్వ నిర్ణయంతో ఏకీభవించాయి. వారు ఈ సమయంలో రాజకీయాలకు అతీతంగా దేశం కోసం కేంద్రం నిర్ణయాలకు మద్దతు తెలిపారు. ఉగ్రవాదం అంశంపై అందరూ ఒకే మాట మీద ఉన్నారు. ఉగ్రవాదంపై పోరాడేందుకు దేశం మొత్తం కలిసి ఉందన్నారు.'అన్ని పార్టీల నేతలు రాజకీయాలు చేయకుండా.. దేశాన్ని కాపాడేందుకు, జాతీయ సమగ్రత కోసం దోహదపడాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం సైన్యానికి పూర్తి స్వేచ్ఛ ఇచ్చిందని, ఉగ్రవాదంపై వారికి ఎలాంటి పరిమితులు లేవని స్పష్టం చేశారు.

**9 ఉగ్రవాద శిబిరాలు ధ్వంసం**

భారత సైన్యం కేవలం 25 నిమిషాల ఆపరేషన్‌లో పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 21 గుర్తించిన ఉగ్రవాద శిబిరాల్లో 9 టార్గెట్ చేసి పూర్తిగా ధ్వంసం చేసింది. వైమానిక దాడులు, క్షిపణి దాడులతో ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేశాం. మరో 12 ఉగ్రవాద శిబిరాలు మిగిలి ఉన్నాయి. త్వరలోనే వాటిపై భారత సైన్యం మరోసారి ఆపరేషన్ సిందూర్ చేపడుతుందని చెప్పారు. మూడు సాయుధ దళాలు అత్యంత సమన్వయంతో ఉగ్రవాదులు లక్ష్యంగా చేసిన దాడి ఆపరేషన్ సిందూర్ అని పేర్కొన్నారుపంజాబ్, రాజస్థాన్, జమ్మూ కాశ్మీర్ ప్రాంతాల్లో పాక్ ఆర్మీ కాల్పులు జరుపుతోంది. కొన్నిచోట్ల సరిహద్దు ప్రాంతాల్లో చొరబాటుకు యత్నిస్తుండగా.. భారత సైన్యం వారి ప్రయత్నాలను తిప్పి కొడుతోందని రాజ్ నాథ్ అన్నారు. మరోవైపు భారత్ సరిహద్దు వెంట భద్రత పెంచింది. పాక్ నుంచి వచ్చే వాటిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు యాంటీ డ్రోన్ సిస్టమ్ యాక్టివేట్ చేశారు.

**మల్లికార్జున ఖర్గే కీలక వ్యాఖ్యలు..**

భద్రతకు సంబంధించి ప్రభుత్వం చెప్పింది తాము విన్నామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తెలిపారు. దేశభద్రతకు సంబంధించి కొన్ని విషయాలు వెల్లడించలేమని రక్షణ మంత్రి తెలిపారని అన్నారు. ఆ విషయాన్ని తాము గౌరవించామని ఖర్గే వెల్లడించారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మేము ప్రభుత్వం వెంట ఉన్నామని చెప్పామని.. తెలిపారు. అఖిల పక్షానికి ప్రధాని రాకపోవడంపై అసంతృప్తి వ్యక్తంచేసిన ఖర్గే.. ప్రస్తుత పరిస్థితుల్లో తాము ఎవరిని విమర్శించడం లేదన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడుతూ ప్రభుత్వానికి అందరూ మద్దతు ప్రకటించారని తెలిపారు.పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన సంస్థకు వ్యతిరేకంగా అంతర్జాతీయంగా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. అఖిలపక్ష సమావేశంలో తాను ప్రభుత్వానికి ఈ సూచన చేశానని అసద్ తెలిపారు.

# పాతబస్తీలో హైడ్రాకు ఎదురుదెబ్బ

**హైదరాబాద్ పెన్ పవర్:**
పాతబస్తీలో హైడ్రా కూల్చివేతలు ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ ఇలాక అయిన చాంద్రాయణ గుట్టలో హైడ్రా కూల్చివేతలు మొదలుపెట్టింది. అక్బర్ నగర్‌లో ఆక్రమించి నిర్మించుకున్న షాపులను భారీ పోలీసు బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు. అయితే వెనక్కి వెళ్లిపోవాలని, తమ ఏరియా జోలికి రావొద్దని పాతబస్తీ వాసులు, పోలీసులతో వాగ్విదానికి దిగడంతో హైడ్రా కూల్చివేతలకు ఆటంకం తలెత్తింది. నగరంలోని పాతబస్తీ చాంద్రాయణగుట్టలోని అక్బర్ నగర్ ప్రాంతంలో హైడ్రా సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేత చర్యలు చేపట్టారు. నగరపాలక అధికారులు, భారీ పోలీసు బందోబస్తుతో హైడ్రా సిబ్బంది అక్బర్ నగర్‌లో అక్రమ నిర్మాణాలు, షాపుల కూల్చివేత చేపట్టింది. ఈ క్రమంలో స్థానికులు హైడ్రా సిబ్బంది పనులను అడ్డుకున్నారు. పోలీసులు వారిని వారించి పక్కకు జరిపే ప్రయత్నం చేయగా.. పోలీసులకు, స్థానికులకు మధ్య నెలకొన్న వాగ్వాదం తోపులాటకు దారితీసింది.కొందరు స్థానికులు ప్రతిఘటిస్తూ హైడ్రా కూల్చివేతలు చేపట్టిన జేసీబీకి ఎదురుగా నిలిచారు. కొందరు జేసీబీ ఎక్కి అడ్డుకునే ప్రయత్నం సైతం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, స్థానికులకు మధ్య వాగ్వాదం మరింత ముదిరి తోపులాట చోటుచేసుకుంది.హైడ్రా చర్యలను వ్యతిరేకిస్తూ పార్టీ కార్పొరేటర్లు, నేతలు హైడ్రా, జీహెచ్ఎంసీ, మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అకస్మాత్తుగా వచ్చి కూల్చివేతలు చేపట్టం ఏంటని, ప్రభుత్వం తీరు, హైడ్రాల తీరు సరికాదని ఆందోళనకు దిగారు. కూల్చివేతలు అడ్డుకునే ప్రయత్నం చేయగా ఎంఐఎం కార్పొరేటర్లు, నేతలు, స్థానికులను పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు.

## కేశినేని చిన్ని సవాల్

**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ ఎంపీ కేశినేని నాని చేసిన ఆరోపణలపై విజయవాడ తెలుగుదేశం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) కౌంటర్ ఇచ్చారు. రాజ్ కసిరెడ్డితో తనకు పరిచయం ఉందని.. నాలుగుసార్లు ఆయనను కలిశానని గుర్తుచేశారు. ఇద్దరం కలిసి ఒక కంపెనీ పెట్టామని దానిని డెవలప్‌మెంట్ చేద్దామని అనుకున్నామని అన్నారు. ఆ కంపెనీ డెవలప్‌మెంట్‌తో సహా ఆరునెలలు అన్నీ ఖర్చులు తానే పెట్టానని స్పష్టం చేశారు. ఇవాళ(గురువారం) విజయవాడలో తన కార్యాలయంలో కేశినేని చిన్ని మీడియాతో మాట్లాడారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డితో రాజ్ కసిరెడ్డికి సాన్నిహిత్యం, అతని వ్యవహారాలు చూసి తాను ఆ కంపెనీలో పెట్టిన పెట్టుబడులు కూడా వదిలేసి రాజ్ కసిరెడ్డితో దూరంగా ఉంటున్నానని స్పష్టం చేశారు. కేశినేని నాని జగన్ దగ్గర పాలేరుగా మారి తనపై ఆరోపణలు చేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మద్యం కుంభకోణంలో రూ.3200 కోట్ల లిక్కర్ స్కాం జరిగిందని, అందులో సూత్రధారి తాడేపల్లి ప్యాలెస్‌లో ఉన్న వ్యక్తేనని ఎంపీ కేశినేని శివనాథ్ ఆరోపణలు చేశారు. ఆ ప్యాలెస్‌లో రాజ్ కసిరెడ్డితో సహా నలుగురికే ఎంట్రీ ఉందని విమర్శించారు. ఇటీవల హైదరాబాద్‌లో ఈ లిక్కర్ వ్యవహారం దృష్టి మరల్చడానికి ఐదుగురు సమావేశం అయ్యారని చెప్పారు. అందులో ధనుంజయ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, గోవిందప్పతో సహా విజయవాడ పాలేరు కూడా ఉన్నట్టు సమాచారం ఉందని ఆరోపించారు.కేశినేని నానికి చెందిన ఇంటర్నేషనల్, దుబాయ్, అమెరికాలోని రెండు కంపెనీల ద్వారా హవాలా జరిగినట్లుగా వచ్చిన వార్తలను నిగ్గు తేల్చాలని.. అందుకు అవసరమైన ఖర్చు తానే పెట్టుకుంటానని అన్నారు. తన కుటుంబంలో ఐదు, ఆరు కంపెనీలు ఉన్నాయని తెలిపారు. అన్నీ లీగల్‌గానే ఉన్నాయని స్పష్టం చేశారు. విజయవాడ పాలేరుకు చాలా కంపెనీలు ఉన్నాయని, వాటి నిగ్గు కూడా తేల్చండి అంటూ కేశినాని నానిపై కేశినేని శివనాథ్ ఆరోపణలు చేశారు. తనపై వచ్చిన ఆరోపణలపై సీబీఐ విచారణకు తాను సిద్ధమని ఎంపీ కేశినేని శివనాథ్ సవాల్ విసిరారు. తనపై వస్తున్న ఆరోపణలపై విచారణకు సీబీఐకి లేఖ రాస్తున్నానని అన్నారు. రూ. 3600 కోట్లు దోచేసిన జగన్ రెడ్డి సీబీఐ విచారణకు సిద్ధమా అని సవాల్ విసిరారు. కేశినేని నాని, జగన్‌కు 24 గంటలు సమయం ఇస్తున్నాఆ ఆరోపణలను నిరూపించాలని కేశినేని శివనాథ్ మాస్ సవాల్ విసిరారు.

## బుధవారం పుట్టిన చిన్నారికి సింధూర పేరు

**హైదరాబాద్ పెన్ పవర్:** బిహార్‌లో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. కాతిహార్ జిల్లాలోని కుందన్ కుమార్ మండల్.. తన కుమార్తెకు సిందూర్ అని పేరు పెట్టారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకార చర్యగా దాయాది దేశం పాకిస్థాన్‌పై కేంద్రం సిందూర్ పేరుతో సైనిక చర్యకు పాల్పడిన రోజు.. తమకు పాప జన్మించిందని ఆయన వివరించారు. అందుకే తమ పాపకు సిందూర్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. ఈ పాపకు సిందూర్ అంటే అర్థం ఇప్పుడే తెలియక పోవచ్చు.కానీ ఆమె పెరిగి పెద్దదైన తర్వాత ఆ పేరుకు అర్థం తెలుసుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. అమాయకుల ప్రాణాలను తీయడం ద్వారా దేశానికి హాని కలిగించే పాకిస్థాన్‌లోని ఉగ్రమూకల పీచమణచడానికి కేంద్ర ప్రభుత్వం ఈ చర్య చేపట్టడం తమకు గర్వంగా ఉందన్నారు. పాపకు ఈ పేరు పెట్టడం పట్ల తమ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారని గుర్తు చేసుకున్నారు. మరోవైపు పాపకు సిందూర్ పేరును ఆసుపత్రిలోని వైద్య సిబ్బంది సైతం ఆమోదించారని చెప్పారు.ఏప్రిల్ 22వ తేదీ జమ్మూ కశ్మీర్ అనంతనాగ్ జిల్లాలోని పహల్గాంలో పర్యాటకులే లక్ష్యంగా ఉగ్రవాదులు దాడులు జరిపారు. ఈ ఘటనలో 26 మంది మరణించారు. ఈ దారుణం వెనుకు పాకిస్థాన్ హస్తం ఉందనేందుకు బలమైన సాక్ష్యాలను భారత్ సంపాదించింది. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ వ్యతిరేకంగా భారత్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అందులోభాగంగా సింధు నదీ జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. అలాగే భారత్‌లోని పాకిస్థానీయులంతా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించింది. అందుకు గడువు సైతం భారత్ విధించింది.ఈ తరహా నిర్ణయాలు తీసుకోవడమే కాకుండా.. మరోసారి పహల్గాం తరహా ఉగ్రదాడి ఘటనలు జరగకుండా భారత్ కీలక నిర్ణయం తీసుకుంది.

## భారత్ భారీ విజయం

హైదరాబాద్ పెన్ పవర్: పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ గ్రాండ్ సక్సెస్ అయ్యింది. దేశంలో దాడులకు పాల్పడుతూ అమాయక ప్రజల ప్రాణాలు తీస్తోన్న ఉగ్రవాద స్థావరాలపై భారత్ జరిపిన మెరుపు దాడుల్లో దాదాపు 100 మంది టెర్రరిస్టులు కుక్క చావు చచ్చారు. మృతుల్లో పలువురు మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టులు ఉన్నారు. జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు మసూద్ అజార్ సోదరుడు, %×జ%-814 ఎయిర్ ఇండియా విమాన హైజాక్‌కు ప్రధాన సూత్రధారి అయిన మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్ అబ్దుల్ రవూఫ్ అజార్ ఆపరేషన్ సిందూర్?లో హతమయ్యాడని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా పాకిస్థాన్?తో పాటు పాక్ ఆక్రమిత కాశ్మీర్?లోని 9 ఉగ్రవాద స్థావరాలపై భారత వైమానిక దళం మెరుపు దాడులు చేసింది. పాకిస్తాన్ బహవల్‌పూర్‌లోని జైషే మహ్మద్ ప్రధాన కార్యాలయంపై కూడా భారత్ ఎటాక్ చేసింది. భారత మిసైల్ దాడుల్లో జైష్-ఎ-మొహమ్మద్ చీఫ్ మసూద్ అజార్ కుటుంబ సభ్యులు 10 మంది మరణించారు. మృతుల్లో జైష్-ఎ-మొహమ్మద్ సుప్రీం కమాండర్ అబ్దుల్ రవూఫ్ అజార్ కూడా ఉన్నట్లు తెలిసింది.

అబ్దుల్ రవూఫ్ అజార్ బ్యాక్ గ్రౌండ్

అబ్దుల్ రవూఫ్ అజార్ పాకిస్తానీ దేవబంది జిహాదిస్ట్ మతాధికారి, మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్ట్. ఇతడు జైష్-ఎ-మొహమ్మద్ (జెఎం) సుప్రీం కమాండర్‌గా పనిచేశాడు. భారత్?పై దాడులను ప్లాన్ చేయడంలో అబ్దుల్ రవూఫ్ ఎక్స్?పర్ట్. రవూఫ్ తన 24 ఏళ్ల వయసులోనే 1999లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ విమానం %×జ%-814 హైజాక్ చేయడంలో కీలక సూత్రధారి. %×జ%-814 విమానం హైజాక్ చేసి.. జైల్లో ఉన్న తన సోదరుడు, జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు మసూద్ అజార్?ను జైలు నుంచి విడిపించాడు. ఇదే కాకుండా జైష్-ఎ-మొహమ్మద్ ఉగ్రసంస్థ భారత్?లో చేసిన దాడుల్లో అబ్దుల్ రవూఫ్?ది మాస్టర్ మైండ్. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ, భారత పార్లమెంటుపై 2001 ఫిదాయీన్ దాడులు, 2016 పఠాన్‌కోట్ వైమానిక స్థావరంపై దాడి, నగ్రోటా, కథువాలో సైనిక శిబిరాలపై దాడులు వెనక కూడా ఇతడి హస్తం ఉంది. 40 మంది సీఆర్పీఎఫ్ సిబ్బందిని బలిగొన్న 2019 పుల్వామా ఎటాక్?తో కూడా రవూఫ్?కు సంబంధం ఉంది. తన సోదరుడు మసూద్ జైల్లో ఉన్నప్పుడు కానీ, అనారోగ్యంతో ఉన్నప్పుడు జేఎం కార్యాచరణ నిర్ణయాలు అన్నీ ఇతడే తీసుకునేవాడు. అప్పటి పాకిస్తాన్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్ హత్య ప్రయత్నాల తర్వాత జేఎం అజ్ఞాతంలోకి వెళ్లినప్పుడు రవూఫ్ అజార్ ఆఫ్ఘనిస్తాన్‌కు వెళ్లి తాలిబన్లతో సత్సంబంధాలు కొనసాగించి.. జేఎం గ్రూపు నిర్వీర్యం కాకుండా పునర్నిర్మించడంలో కీ రోల్ ప్లే చేశాడు. భారత్ లో ఎన్నో దాడులు చేసి రక్తపాతం పారించిన అబ్దుల్ రవూఫ్ అజార్ ను ఇండియా మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టు జాబితాలో చేర్చింది. ఇతడిని పట్టుకోవడం కోసం నిఘా సంస్థలు పని చేస్తున్నాయి. ఈ క్రమంలో పహల్గాం ఉగ్రదాడికి కౌంటర్?గా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్?లో ఈ జేఎం మాస్టర్ మైండ్ హతమయ్యాడు.

## ఆర్టీసీ బస్సు కింద పడి రిటైర్డ్ ఉద్యోగి మృతి

హైదరాబాద్ పెన్ పవర్:ఇరిగేషన్ శాఖలో వాచ్మెన్ గా పనిచేస్తున్న గంధం శెట్టి నరసింహులు (70) కొన్ని సంవత్సరాలు క్రితం రిటైర్డ్ అయ్యారు, వారి పనుల కోసం ఉదయం గానుగ పెంట నుండి ఆర్టీసీ బస్సులో బయలుదేరి బద్వేల్ కు వచ్చారు, అయితే ఆర్టీసీ బస్టాండులో బస్సు దిగి అతను బ్లైండ్ కాబట్టి కొంత సమయం పడడంతో అక్కడినుండి ప్రధాన రహదారి చేరుకోవడంతో అప్పుడే బస్టాండ్ లో నుంచి బస్సు మరల గానుగ పెంట కు బయలుదేరి వస్తూ ఉండగా మలుపు తిరిగే వద్ద అదే వ్యక్తిపై ముందు చక్రం ఎక్కడంతో నరసింహులు అక్కడికక్కడే మృతి చెందారు, దీంతో 20 నిమిషాలపాటు పూర్తిస్థాయిలో ట్రాఫిక్ జామ్ కావడంతో విషయం తెలుసుకున్న బద్వేల్ అర్బన్ పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని రోడ్డు ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్ కు తరలించి ట్రాఫిక్ యధావిధిగా వాహనాలు వెళ్లే విధంగా పోలీసులు చొరవ తీసుకున్నారు మృతదేహాన్ని బద్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

# ఏపీపీఎస్సీ స్కాంలో ధాత్రి మధుకు రిమాండ్

హైదరాబాద్ పెన్ పవర్:వైసీపీ హయాంలో జరిగిన ఏపీ గ్రూప్ 1 మెయిన్స్ జవాబు పత్రాల వాల్యుయేషన్ కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 మెయిన్స్ పేపర్ల వాల్యువేషన్లో పాల్గొన్న సతీష్ అనే నందిగామకు చెందిన యువకుడు ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడ్ని విజయవాడ స్వర ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ కేసులో ఏ2గా ఉన్న క్యామ్‌సైన్ డైరెక్టర్ ధాత్రి మధుకు విజయవాడ కోర్టు మే 21వరకు రిమాండ్ విధించింది.ఆంధ్రప్రదేశ్ గ్రూప్ 1 పరీక్షల అక్రమాల కేసులో సతీష్ ను పోలీసులు ఇటీవల రెండు రోజుల పాటు విచారించారు. విచారణకు వెళ్లి వచ్చిన రెండో రోజు నందిగామకు చెందిన సతీష్ ఆత్మహత్యా యత్నం చేశాడు. సతీష్ ఆత్మహత్యాయత్నం విషయాన్ని బయటకు రాకుండా పోలీసులతో పాటు కుటుంబ సభ్యులు సీక్రెట్‌గా ఉంచారు. ఏపీపీఎస్సీ గ్రూప్ 1 అక్రమాల కేసులో వాల్యూవేషన్లో పాల్గొన్న 60 మందిని పోలీసులు విచారించారు. సతీష్ గతంలో నందిగామలో ఓ ప్రవేట్ కళాశాలలో లెక్చరర్ గా పనిచేశాడని సమాచారరాష్ట్ర గ్రూప్ 1 మెయిన్స్ ఆన్సర్ షీట్ల మూల్యాంకనంలో భారీ కుంభకోణం జరిగిందని ఆరోపణలు రావడంతో పోలీసులు ఈ అంశాన్ని సీరియస్ గా తీసుకున్నారు. గ్రూప్ 1 స్కామ్ కేసులో ఏ2గా ఉన్న క్యామ్‌సైన్ మీడియా ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మధుసూదన్ (ధాత్రి మధు) డైరెక్టర్‌గా ఉన్నారు. ఏపీపీఎస్సీ అప్పటి కార్యదర్శి, ఐపీఎస్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాల మేరకు గ్రూప్ 1 మెయిన్స్ వాల్యుయేషన్లో భారీ అక్రమాలకు క్యామ్‌సైన్ తెరలేపిందని పోలీసుల దర్యాప్తులో తేలింది. హాయ్‌ల్యాండ్ వేదికగా మాన్యువల్ మూల్యాంకనమే చేపట్టలేదని గుర్తించారు. కానీ గ్రూప్ 1 మెయిన్స్ పేపర్ల మూల్యాంకనం చేసినట్లుగా నమ్మించేందుకు అర్హత లేని వ్యక్తులను తాత్కాలికంగా నియమించినట్లు పోలీసులు చెబుతున్నారుఇంకా చెప్పాలంటే వాల్యుయేషన్ గురించి ఏమాత్రం అవగాహన లేని గృహిణులు, చంటి బిడ్డల తల్లులను పేపర్ల వాల్యుయేషన్ కోసం తాత్కాలికంగా నియమించుకుని నాటకం ఆడటంతో కథ అడ్డం తిరిగిందని అధికారులు తెలిపారు. జవాబు పత్రాలను తాము కనీసం తెరిచి చూడలేదని, క్యామ్‌సైన్ మేనేజ్‌మెంట్ చెప్పిన విధంగా మార్కులు మాత్రమే వేసినట్లు వాల్యుయేషన్ చేసిన కొందరు విచారణలో ఒప్పుకున్నారని సమాచారం. హైదరాబాద్ బంజారాహిల్స్ రోడ్ నంబర్-10 లోని క్యామ్‌సైన్ ఆఫీసులో సోదాలు చేపట్టిన దర్యాప్తు అధికారులు మధుసూదన్ (ధాత్రి మధు)ను సుదీర్ఘంగా విచారించారు. విచారణ అనంతరం అతడిని అరెస్టు చేసి విజయవాడకు తరలించారు. మరుసటిరోజు విజయకోర్టులో ప్రవేశపెట్టగా రెండు వారాలపాటు రిమాండ్ విధించింది. అనంతరం విజయవాడ జైలుకు మధుసూదన్‌ను తరలించారు.

# ప్రధాని పరమశివుడే.. అంటూ పవన్ ట్వీట్



హైదరాబాద్ పెన్ పవర్:
ప్రధాని మోదీని ఉద్దేశిస్తూ ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ %ఌ% లో ఓ ఆసక్తికర పోస్ట్ చేశారు. ఆ పోస్ట్ లో ఆయన ప్రధాని మోదీని “అనికేత్”గా అభివర్ణించారు. “అనికేత్ అంటే శివుడి పేరు, ఒక సంకల్పం అని ఆయన కొనియాడారు. తన సన్యాస జీవితంలో ప్రధాని మోదీ 'అనికేత్'గా పిలువబడ్డారని పవన్ కల్యాణ్ రాసుకొచ్చారు. అనికేత్ అంటే 'ఇల్లు లేకుండా జీవించే వారని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు. ప్రపంచంలోని ప్రతి కణం వారి ఇల్లే అయినపటికీ వారికంటూ ఒక ప్రత్యేక స్థావరం ఉండదని పవన్ తెలిపారు. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు, కామాఖ్య నుండి ద్వారక వరకు మొత్తం భారత్‌ను ప్రధాని తమ ఇల్లుగా భావించారని ఆయన పేర్కొన్నారు. తనకు ఇల్లు లేకపోయినా ప్రధాన మంత్రి ఆవాస్ యోజన' ద్వారా కోట్లాది మందికి సొంత ఇల్లు అందించిన ఘనత మోదీది అంటూ ఆయన చేసిన పోస్ట్‌లో పవన్ కల్యాణ్ రాసుకొచ్చారు.మరోవైపు ఆపరేషన్ సిందూర్ విజయవంతంపై పవన్ కల్యాణ్ స్పందించారు. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడికి భారత్.. పాకిస్తాన్ పై ప్రతీకారం తీర్చుకుందని అన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్‌లో 30మందికి పైగా కీలక ఉగ్రవాదులు హతమయ్యారని అన్నారు. ఇది ప్రతి భారతీయుడు హర్షించదగ్గ విషయమంటూ పవన్‌కల్యాణ్ వివరించారు. ప్రధాని మోదీ నేతృత్వంలో ధీటుగా బదులిచ్చామని%ో% భారత్‌పై ఎవరు దాడి చేసినా సహించేదిలేదంటూ పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో అంతా దేశానికి అండగా ఉండాలి.. ప్రతి ఒక్కరూ మోదీకి మద్దతుగా నిలవాలంటూ కోరారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లకు కూడా పవన్ కల్యాణ్ వార్నింగ్ ఇచ్చారు. దేశానికి వ్యతిరేకంగా ఎవరూ పోస్టులు పెట్టొద్దు.. దేశ భద్రత విషయంలో.. ఇన్‌ఫ్లుయెన్సర్లు జాగ్రత్తగా మాట్లాడాలంటూ కోరారు. లేకపోతే చర్యలు తప్పవంటూ పేర్కొన్నారు

# భారత వీర మహిళా “సోఫియా ఖురేషి”

జగిత్యాల, పెన్ పవర్:
:ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ లోని ఉగ్రవాదుల స్తావరాలపై మెరుపుదాడులు చేపట్టిన కల్నల్ సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ లు భారతదేశం గర్వించదగ్గ వీర మహిళలని జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి ప్రశంశించారు.పహల్గం వద్ద పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిలో 26మంది ప్రాణాలు కోల్పోగా ఈ దాడికి ప్రతికారంగా భారతసైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట పాకిస్థాన్ లోని 9 ఉగ్ర స్తావరాలపై మెరుపు దాడులు చేయడాన్ని ప్రతి భారతీయుడు అభినందనలు తెలుపుతున్నారని కిషన్ రెడ్డి గురువారం జగిత్యాలలో ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆపరేషన్ సింధూర్ లోఆర్మీ అధికారిణి కల్నల్ సోఫియా ఖురేషి చరిత్ర సృష్టించారని కొనియాడారు.

కేవలం 25 నిమిషాల్లో ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేసి భారత సైన్యం ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేశాయని ఇందులో కీలక పాత్ర పోషించిన కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్ ల సాహసాన్ని భారతదేశ ప్రజలు ఎన్నటికీ మర్చిపోలేరని కిషన్ రెడ్డి అన్నారు.దేశ భద్రతే కర్తవ్యమని భావించి సోఫియా ఖురేషి, వ్యోమికా సింగ్ లు దేశ భక్తిని చాటారని,

వీరు దేశానికి శక్తివంతమైన మహిళలని కొనియాడారు.

దేశం యుద్ధం ముంగిట ఉంది... ఇలాంటి తరుణంలో భారత పౌరులందరు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఎవరి స్వస్థలాలకు వారే సైనికుడిలా ఉండాలని కిషన్ రెడ్డి కోరారు.